# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

# ప్రాంతీయ వార్తా విభాగం

# ప్రాంతీయ వార్తలు

తేది : 05-02-2026 సమయం : 1.20 గంటలు

## ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలోని సాగునీటి సంఘాల అధ్యక్షులతో సమావేశంకానున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**
2. **విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు వంటి అంశాలను తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్న హోం శాఖ మంత్రి వి.అనిత**
3. **2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో విద్యుత్ మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించామన్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**
4. **స్వర్ణ గ్రామం, వార్డు కార్యాలయాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారుల నియమించనున్నామని వెల్లడించిన మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

-----------------------

రాష్ట్రంలోని అన్ని సాగునీటి సంఘాల అధ్యక్షులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మధ్యాహ్నం సమావేశమవుతారు. రాజధాని

అమరావతిలోని నేలపాడు పరేడ్ మైదానంలో జరిగే ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ తో పాటు సాగునీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొననున్నారు. నీరు - ప్రగతి - జల హారతి సాగునీటి సంఘాల భాగస్వామ్యం పేరుతో నిర్వహించే ఈ సమావేశంలో కరవు రహిత రాష్ట్రంగా రాష్ట్రాన్ని మార్చేందుకు ప్రభుత్వ లక్ష్యాలు, నీటి భద్రత, భూగర్భజలాల పెంపుపై సాగునీటి సంఘాలకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేయనున్నారని అధికారులు తెలిపారు.

-----------------------

విద్యార్థులకు చదువుతో నైతిక విలువలు వంటి అంశాలను తెలియజేయాల్సిన అవసరం ఉందని హోం శాఖ మంత్రి వి. అనిత తెలిపారు. అనకాపల్లి జిల్లా తిమ్మాపురంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన "విద్యా దీప్తి - సంస్కార స్ఫూర్తి" కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావుతో మంత్రి ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్యం, మంచి ఆదర్శాలు వంటి అంశాలపై విద్యార్థులను ఉద్దేశించి చాగంటి కోటేశ్వరరావు ప్రసంగించారు.అంతకుముందు హోం మంత్రి అనిత మాట్లాడుతూ,

వాయిస్ 30 సెకన్లు

-----------------------

2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో విద్యుత్ మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. తూర్పుగోదావ జిల్లాలో అమలవుతున్న విద్యుత్ కార్యక్రమాలపై సంబంధిత

అధికారులతో రాజమహేంద్రవరంలో మంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు.విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, అనుబంధ పనుల పురోగతిపై అధికారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పుష్కరాల సమయంలో అంతరాయం లేకుండా సమగ్రంగా విద్యుత్ ఏర్పాట్లు చేయాలన్నారు. పునరుద్ధరించిన పంపిణీ రంగ పథకం-ఆర్‌డీఎస్‌ఎస్ పథకం కింద విద్యుత్ పునర్ వ్యవస్థీకరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 2026 మార్చి నాటికి ఏపీ ట్రాన్స్ కో పరిధిలో విద్యుత్ ఉప కేంద్రాల పనులు పూర్తి చేయాలని మంత్రి సూచించారు

----------------------

పల్నాడు జిల్లాలోని కొండవీడు కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈనెల 7, 8 తేదీల్లో "కొండవీడు కోట ఉత్సవాలను" నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. కొండవీడు కోట ఉత్సవాల ముందస్తు ప్రారంభ కార్యక్రమంలో భాగంగా చిలకలూరిపేటలో నిర్వహించిన 2కే పరుగు కార్యక్రమంలో మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి కలెక్టర్ ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృతిక శుక్లా మాట్లాడుతూ,

వాయిస్ 28 సెకన్లు

----------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలోని విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషించే ‘‘పరీక్షా పే చర్చా’’ కార్యక్రమం రేపు ప్రసారం కానుంది. పరీక్షా పే చర్చ

కార్యక్రమాన్ని వీక్షించాలని ప్రధానమంత్రి కోరారు. ఒత్తిడి లేని పరీక్షల ప్రాముఖ్యతను గురించి ప్రస్తావిస్తూ... పరీక్షలలో సవాళ్లను అధిగమించడం, సమతుల్యతను కాపాడడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం వంటి వివిధ అంశాలను ప్రధానమంత్రి ఈ కార్యక్రమంలో తెలియజేస్తారు. ఈ సంవత్సరం దేవ్ మొగ్రా, కోయంబత్తూర్, రాయపూర్, గువహటికి చెందిన విద్యార్థులతో ఢిల్లీలోని లోక్ కళ్యాణ్ మార్గ్ లో చర్చించనున్నట్లు ప్రధాన మంత్రి తెలియజేశారు. పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ ఏడాది 4.5 కోట్ల మంది నమోదు చేసుకున్నారు.

-----------------------

స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల పర్యవేక్షణకు జిల్లా, మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించనున్నామని స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఉద్యోగుల హేతుబద్ధీకరణ, పదోన్నతులు, మూడంచెల వ్యవస్థ వంటి అంశాలపై సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో పని చేయని కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. సిబ్బంది పనితీరుపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నామని, ప్రజల్లో సంతృప్తే లక్ష్యంగా మెరుగైన సేవలందించాలని మంత్రి సూచించారు.

-----------------------

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం భూపాలపట్నం పందిరివారి తోట పరిసరాలలో పులి ఒక పశువు ని చంపినట్లు నిర్ధారణ అయిందని జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పులి కదలికలు గమనించిన వెంటనే సంబంధిత అటవీ లేదా పోలీస్ అధికారులకు సమాచారం తెలియజేయాలని కోరారు. పొలాలు, తోటలు, అటవీ ప్రాంతాల వైపు ఒంటరిగా వెళ్లవద్దని, విద్యార్థులు, పిల్లలు వృద్ధులు అత్యవసరం అయితే తప్ప ఇంటి నుండి బయటకు రావద్దని సూచించారు. ప్రస్తుతం ఎర్రంపాలెం ప్రాంతాల్లో పులి కదలికలు గుర్తించామని పులి సంచరించే ప్రాంతాలకి ఎవరూ వెళ్లవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు

----------------------

విజయవాడలోని ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను నీతి ఆయోగ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం తో కలిసి ఈ రోజు దర్శించుకున్నారు. వారికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శీనానాయక్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా జి లక్ష్మీ షా పలు జిల్లా అధికారులు నీతి అయోగ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వెంట ఉన్నారు.

----------------------

బుర్రకథా పితామహుడు షేక్ నాజర్ జయంతి ఈరోజు. గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామంలో 1920 ఫిబ్రవరి 5వ తేదీన ఆయన జన్మించారు. పల్నాటియుద్ధం, బొబ్బిలి యుద్ధం, అల్లూరి సీతారామరాజు, బెంగాల్ డొక్కల కరువు మొదలైన ఇతి వృత్తాలతో సమకాలీన రాజకీయాలను జోడించి బుర్రకథలు రూపొందించి ఆయన ప్రదర్శించారు. తెలుగువారి సాంస్కృతిక జీవనంలో ప్రముఖస్థానం వహించిన కళారూపం బుర్రకథకు గౌరవం కల్పించి ప్రజా కళగా తీర్చిదిద్దిన నాజర్ కమ్యూనిస్ట్ ఉద్యమాల్లో అనేక సార్లు జైలు శిక్ష అనుభవించారు. 1986లో కేంద్ర ప్రభుత్వం నుండి పద్మశ్రీ బిరుదును పొందిన షేక్ నాజర్ 1997 ఫిబ్రవరి 21వ తేదీన తుదిశ్వాస విడిచారు.

----------------------

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ , ఎన్టీఆర్  జిల్లా ఉపాధి కల్పన శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 7 వ తేదీన  ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి సి. మధుభూషణ్ రావు ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గుంటుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7 వ తేదీ ఉదయం 09:00 గంటలనుంచి ఈ మేళాను నిర్వహించనున్నామన్నారు.  10 వ తరగతి, ఇంటర్మీడియట్, ఐ.టి.ఐ, పాలిటెక్నిక్, డిగ్రీ  బి.టెక్ పూర్తిచేసి   18 నుండి 35 సంవత్సరాల వయసు గల యువత ఉద్యోగ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు.ఉద్యోగ మేళాలో పాల్గొనే అభ్యర్థులు naipunyam.ap.gov.in వెబ్ సైట్ లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.

----------------------